ఆనాటి అరాచకాలు మరువగలమా!

- టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ఐదేళ్లు రాక్షస క్రీడ
- వృద్ధులు, దివ్యాంగులకు నరకం చూపించిన టీడీపీ నాయకులు
- పార్టీ మారితేనే పింఛన్‌లంటూ వేధింపులు
- అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్ల మంజూరు
- వలంటీర్ల ద్వారా ఇంటివద్దే పెన్షన్ల పంపిణీ

జి.కొండూరు: చంద్రబాబు ప్రభుత్వం 2014–19 మధ్య కాలంలో జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగించింది. నాటి అరాచకాలను బాధితులు నేటికీ మరువలేదంటే ఐదేళ్లపాటు ఏ రీతిలో వారి వేధింపులు కొనసాగాయో ఇట్టే అర్థమవుతోంది. ప్రభుత్వ పథకాల నుంచి అభివృద్ధి కార్యక్రమాల వరకు అన్ని పనులు జన్మభూమి కమిటీల పర్యవేక్షణలో జరిగే విధంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం కార్యాచరణ రూపకల్పన చేయడంతో జన్మభూమి కమిటీల అరాచకాలకు అడ్డే లేకుండా పోయింది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్న అధికారులు సైతం కనీస విద్యార్హతలేని వ్యక్తులు సభ్యులుగా ఉన్న జన్మభూమి కమిటీల కింద పనిచేయాల్సి రావడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసేవారు. అర్హత ఉన్న వృద్ధులు, దివ్యాంగులపై వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే ముద్ర వేసిన జన్మభూమి కమిటీ సభ్యులు, ఐదేళ్లపాటు వారికి పింఛన్‌లు ఇవ్వకుండా అడ్డుకున్నారంటే వారి నియంత పాలన ఏ రకంగా జరిగిందో అర్థమవుతోంది. ఐదేళ్లపాటు టీడీపీ పాలనలో నరకం చూసిన రాష్ట్ర ప్రజలకు ఆ పాలన నుంచి విముక్తి కలిగి ఐదేళ్లు కావస్తున్న తరుణంలో మరలా వలంటీర్లను అడ్డుకొని వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బంది పెడుతున్న తీరు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. దురదృష్టవశాత్తూ మరలా టీడీపీ వస్తే అదే రాక్షస పాలన కొనసాగుతుందేమోననే భయం వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలను వెంటాడుతోంది.



టీడీపీ హయాంలో రాజకీయ వివక్షకు గురై పింఛన్ రాని బాధితులకు సొంత నిధులతో పింఛన్లు అందజేస్తున్న పిల్లి రామారావు (ఫైల్)

తీవ్ర వివక్ష..

అప్పట్లో ప్రభుత్వ పథకాలు, కార్పొరేషన్ రుణాల మంజూరు బాధ్యత సైతం తెలుగుదేశం ప్రభుత్వం జన్మభూమి కమిటీలకు అప్పగించింది. ఇదే అదునుగా భావించిన జన్మభూమి కమిటీ సభ్యులు పిచ్చోడి చేతిలో రాయిలా అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయకుండా తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి అర్హత ఉన్నా, లేకున్నా ఇష్టానుసారంగా పింఛన్లు మంజూరు చేశారు. ఈ విధంగా చేయడం వల్ల అప్పట్లో ఉమ్మడి కృష్ణా జిల్లా మొత్తం మీద 870 పింఛన్లు అనర్హులకు ఇచ్చినట్లు గుర్తించి రద్దు చేశారు. కార్పొరేషన్ రుణాలలో సైతం ఐదేళ్లపాటు ఇదే తీరు కొనసాగింది.

వెన్నుపూస విరిగినా కనికరించలేదు..

జి.కొండూరు మండల పరిధి చెర్వుమాధవరం గ్రామానికి చెందిన గరికపాటి ఏసుపాదం వయస్సు 40 సంవత్సరాలు. ఈయన ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ 2010లో ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభంపై నుంచి పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఏసుపాదంకు వెన్నుపూస పూర్తిగా విరిగిపోవడంతో రెండు కాళ్లు చచ్చుబడిపోయి మంచానికే పరిమితమయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఏసుపాదంను పోషించడం ఆ కుటుంబానికి భారంగా మారింది. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు జన్మభూమి కమిటీల చేతిలో పెట్టడంతో ఏసుపాదం సైతం వీరి రాక్షస క్రీడలో బాధితుడిగా మిగిలిపోయాడు. ఏసుపాదం కుటుంబం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే నెపంతో ఐదేళ్లపాటు పింఛన్ అందకుండా అడ్డుకున్నారు. లబ్ధిదారుల జాబితాలో పేరున్నప్పటికీ పూటగడవని స్థితిలో ఉన్న ఏసుపాదంకు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా అడ్డుకున్న తీరు సమీప గ్రామాల ప్రజలను సైతం కలచి వేసింది. దీనితో ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను గమనించిన జన్మభూమి కమిటీ సభ్యులు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏసుపాదంకి పింఛన్‌ను మంజూరు చేశారు. కానీ నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామ వలంటీర్ నేరుగా ఏసుపాదం వద్దకు వెళ్లి పింఛన్‌ను అందజేయడంపై ఆ కుటుంబం హర్షం వ్యక్తం చేస్తోంది.



మంచానికే పరిమితమైన చెర్వుమాధవరం గ్రామానికి చెందిన ఏసుపాదం (ఫైల్)

సొంత నిధులతో పింఛన్లు ఇచ్చిన వైఎస్సార్ సీపీ నాయకుడు..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ఆడిన రాక్షస క్రీడలో పింఛన్‌లకు అర్హులైన గంగినేని గ్రామానికి చెందిన 15 మంది ఐదేళ్లు బాధితులుగా మిగిలిపోయారు. అర్హత ఉన్నప్పటికీ ఈ 15 మందికి కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే నెపంతో పింఛన్‌లను మంజూరు చేసేందుకు సదరు జన్మభూమి కమిటీ సభ్యులు నిరాకరించారు. దీంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రస్తుత సర్పంచ్ పిల్లి రామారావు తన సొంత నిధులతో వైఎస్సార్ పెన్షన్ స్కీము పేరుతో మూడేళ్ల పాటు ఒక్కొక్కరికీ నెలకు రూ.500 చొప్పున పింఛన్‌లను పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని అర్హుల జాబితాలో చేర్పించారు.

కనక దుర్గమ్మను దర్శించుకున్న సర్నాల



ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కుటుంబ సమేతంగా విజయవాడ కనకదుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తిరుపతిరావు దంపతులకు ఆశీస్సులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తిరుపతిరావు తెలిపారు. దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ కరీం, గర్నేపూడి వెంకటరావు, ఎస్.దుర్గాప్రసాద్, బాణావత్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామిదాసు ఎన్నికల ప్రచారం

ఎ.కొండూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సోమవారం ఎ.కొండూరు మండలంలోని రామచంద్రాపురం, చీమలపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని జెడ్పీటీసీ భూక్య గనియా తెలిపారు. ఆ రెండు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

స్వామిదాసుకు పద్మశాలీల సన్మానం



తిరువూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరులో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పద్మశాలీల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టనన్ని సంక్షేమ పథకాలను పేద, మధ్య తరగతి ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టి ఐదేళ్లుగా అమలు చేస్తున్నారని వివరించారు. సంక్షేమ పథకాలు ఇదేవిధంగా కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా పద్మశాలీల సంఘం సభ్యులు నల్లగట్ల స్వామిదాసును శాలువా కప్పి సత్కరించారు.

సత్ప్రవర్తనతో మెలగండి

తిరువూరు సీఐ నబీ



తిరువూరు: పాత నేరస్తులు, రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ అన్నారు. తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, వివిధ నేరాలకు పాల్పడి రౌడీషీటర్లుగా నమోదైన వారికి సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు, అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారు ప్రవర్తన మార్చుకుని మంచి నడవడికతో ఉండాలన్నారు. ఈ సమయంలో ఏదైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

వెయ్యిమందికి వైద్య సేవలు



తిరువూరు: మందులను క్రమం తప్పకుండా వాడటంతోపాటు, తగిన ఆహార నియమాలు పాటిస్తే రక్తపోటు, మధుమేహం, మూర్ఛ వ్యాధులు అదుపులో ఉంటాయని వైద్యులు రాంప్రదీప్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరు నాగార్జున పాఠశాలలో మధుమేహ వ్యాధి గ్రస్తులకు ప్రత్యేక ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు రవీంద్ర, రామకోటేశ్వరరావు, సత్యతేజ, కృపారాణి, మెడికో ఆర్. అలేఖ్యలు రోగులకు వైద్యసేవలు అందజేశారు. వెయ్యి మంది రోగులను పరీక్షించి వారికి రెండు నెలలకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. జన విజ్ఞాన వేదిక సభ్యులు హరికృష్ణ, గంగాధర్, సుభానీ, రాంప్రదీప్ పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి రూ. 50 వేల వితరణ



మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి భక్తుడు ఆదివారం రూ. 50 వేలు ఇచ్చారు. పెనుగొలనుకు చెందిన నూకల లక్ష్మీనారాయణ, ధనలక్ష్మీ దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డికి అందజేశారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ముసునూరు: రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన కొటికల సీతారామయ్య తన భార్య కుమారితో కలిసి ద్విచక్రవాహనంపై ద్వారకా తిరుమల వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో వారు వలసపల్లి చేరుకోగానే ముసునూరు వైపు నుంచి ధర్మాజీగూడెం వైపు వెళుతున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో పడిపోయారు. బైక్ వెనుక ఉన్న కుమారి తలకు తీవ్ర గాయమైంది. బాధితురాలిని 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి

మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు

మైలవరం: వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. తన నామినేషన్ కార్యక్రమానికి విశేష సంఖ్యలో విచ్చేసిన వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పోలింగ్ రోజున అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓట్లును ఫ్యాన్ గుర్తుకు వేసి తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకురావాలని కోరారు. విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని), మైలవరం ఎమ్మెల్యేగా తనను గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలన్నారు. పార్టీ మైలవరం నియోజకవర్గ పరిశీలకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ర్యాలీ పాల్గొనడం చూస్తుంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయ మని, సర్నాల తిరుపతిరావు విజయం తథ్యమని చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, వెల్లటూరు కేడీసీసీబీ అధ్యక్షుడు రవీంద్ర రాణా, మండల పార్టీ అధ్యక్షుడు జి. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న తిరుపతిరావు, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

తిరుపతిరావుకు మద్దతుగా ప్రచారం

రెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుకు మద్దతుగా రెడ్డిగూడెం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి కుదప గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతిరావు సతీమణి నాగలక్ష్మితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. పేదల పక్షాన నిలబడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయటానికి, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుకు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)కు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మండలంలోని కూనపరాజుపర్వ గ్రామంలో ఉప సర్పంచ్ తోటకూర రవిబాబు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, వైస్ ఎంపీపీలు చాట్ల రాబర్టు, పాటిబండ్ల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాటిబండ్ల సత్యం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కుదప గ్రామంలో ప్రచారం చేస్తున్న విజయభాస్కరరెడ్డి

కనుల పండువగా రఘునాథస్వామి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు .. (ఇన్‌సెట్) రఘునాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి రఘునాథ స్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన కల్యాణం అర్ధరాత్రి వరకు కొనసాగింది. స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇక్కడ శ్రీ రామ నవమి అనంతరం మూడో రోజైన ద్వాదశి రోజున స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు మండలాల నుంచి వేలాది మంది భక్తులు గొల్లపల్లికి తరలివచ్చారు. భక్తులకు గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ నల్లూరి సతీష్‌కుమార్ పర్యవేక్షించారు.

టీడీపీ అభ్యర్థి వసంతను నిలదీస్తున్న ఓటర్లు

ఆ నోట్ల సంగతేమిటి అని ప్రశ్నలు

ఇబ్రహీంపట్నం: మైలవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్‌ను గత ఎన్నికల్లో చేసిన పాపాలు వెంటాడుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపట్నం ఖాజీమాన్యంలో రెండు రోజుల కిందట ఆయన పర్యటించిన సమయంలో ఓటర్లు నిలదీశారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో రూ.10 నోట్లు చించిన ముక్కలు ఓటర్లకు పంచారు. మరో ముక్క తన వద్ద ఉంచుకున్నాడు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత చించిన నోటు ముక్క తీసుకొస్తే రూ.2 వేలు ఇస్తానని నమ్మబలికాడు. అనేకమంది ఆయన మాటలు నమ్మి అప్పట్లో ఆయనకు ఓట్లువేసి గెలిపించారు. గెలిచిన తర్వాత రూ. 2 వేలు ఇవ్వకుండా ఎగ్గొట్టాడు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖాజీమాన్యంలో వసంత పర్యటించారు. ఒక ఓటరు గతంలో చించి ఇచ్చిన నోటును వసంత వద్దకు తెచ్చి దీని పరిస్థితి ఏమిటని నిలదీశాడు. విననట్లు నటించి వెళుతున్న వసంత తీరును ఓ రిపోర్టర్ వీడియో తీశాడు. ఇది గమనించిన వసంత అనుచరులు రిపోర్టర్‌ను అడ్డగించి బలవంతంగా ఫోన్‌లో వీడియో డిలీట్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఇదే అంశంపై వసంత కృష్ణప్రసాద్‌ను ఎన్నికల పర్యటనలో మరింతమంది నిలదీసే అవకాశం ఉంది. దీంతో పార్టీ శ్రేణులు రూ.10 నోటు ముక్కలు పంచిన ఏరియాలో ప్రచారం చేయకుండా ఉండటమే మంచిదని వసంతకు సూచిస్తున్నారు.

సాయుధ బలగాలతో కవాతు



ఆగిరిపల్లి: ఈదులగూడెంలో ఎస్ఐ సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తవేరియా నాయక్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన నవమి వేడుకలు

చాట్రాయి: మండలంలోని చనుబండ కోదండ రామాలయంలో నవమి వేడుకలు శనివారం రాత్రి పవళింపు సేవతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివార్లను రాత్రి 11 గంటల సమయంలో పల్లకిలో ఆసీనులు గావించి ఆలయం చుట్టూ 12 ప్రదక్షిణలు చేశారు. అనంతరం పవళింపు సేవ జరిగింది.

మంచి చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి

కలగర (విస్సన్నపేట): అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సతీమణి నల్లగట్ల సుధారాణి అన్నారు. స్వామిదాసుకు మద్దతుగా ఆదివారం ఆమె కలగర ఎస్సీ వాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంచి జరిగితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటున్నారని, మంచి చేసిన ప్రజా నాయకుడు కాబట్టే ప్రజలు జగన్ బస్సుయాత్రకు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో స్థానికుడు, అందరి మంచి కోరుకునే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)కి ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ దేశిరెడ్డి రమ, ఎంపీటీసీ వాసం పుల్లమ్మ, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, సొసైటీ అధ్యక్షుడు బి. వెంకటరెడ్డి, గ్రామ ప్రముఖుడు దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కలగర ఎస్సీ వాడలో ప్రచారం చేస్తున్న సుధారాణి, నాయకులు

జగనన్నను మరోసారి ఆదరించండి

గంపలగూడెం: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఐదేళ్లు సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆదరించాలని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సతీమణి నల్లగట్ల సుధారాణి కోరారు. ఆదివారం ఆమె గంపలగూడెం తూర్పు దళితవాడ ఎస్సీ, బీసీ కాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు స్వామిదాసు, కేశినేని నానిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియంతృత్వ పోకడలు భరించలేం!

- టీడీపీ సీనియర్ నేతలపై ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాసరావు అనుమానాలు
- అడుగడుగునా వివాదాస్పద వ్యాఖ్యలు, అవమానాలు
- అభ్యర్థి తీరుకు నాయకుల ఆగ్రహం
- తెలుగుదేశం పార్టీకి దూరమవుతున్న క్యాడర్

తిరువూరు: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సీనియర్లను ఆ పార్టీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు దూరం చేసుకొంటున్నారు. నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లోకి ఎక్కడమే కాక తన గెలుపునకు కృషిచేసే క్యాడర్‌ను అనుమానంతో చూడటం ఆయనకు పరిపాటయ్యిందని పలువురు భావిస్తున్నారు. ఇటీవల కొలికపూడి వద్దంటూ కొందరు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని వద్దకు, ఆ పార్టీ అధినేత చంద్రబాబు వద్దకు వెళ్లి ఆందోళనలు చేశారు. ఇందుకు తెరవెనుక పాత్రధారులు ఉన్నారని అనుమానించి వారిలో సీనియర్ నేత తాళ్లూరి రామారావును కొలికపూడి టార్గెట్ చేశారు. శనివారం పార్టీ నేత జన్మదిన వేడుకల సందర్భంగా బూత్ కమిటీ సభ్యుల ఎంపికపై చర్చిస్తున్న సందర్భంగా ఒక్కసారిగా తాళ్లూరిని ఉద్దేశించి పరుష పదజాలాన్ని ప్రయోగిస్తూ అందరి ముందు తాళ్లూరిని ఘోరంగా అవమానించి, వ్యక్తిగతంగా కించపరిచే విధంగా మాట్లాడారు. కొలికపూడి తీరుతో మరోసారి పార్టీ క్యాడర్ ఖంగుతింది. మీ సేవలు పార్టీకి అవసరం లేదంటూ అయన్ను ఏకపక్షంగా బయటకు పంపించారు. తాళ్లూరికి మద్దతుగా మాట్లాడబోయిన మరో ఇద్దరు సీనియర్లను కూడా కొలికపూడి అవమానించినట్లు తెలిసింది. అంతకు ముందు రియల్టర్‌గా వ్యవహరించే గంపలగూడెం మండలానికి చెందిన టీడీపీ నేత వ్యాపార లావాదేవీల్లో భాగంగా ఒక వైఎస్సార్ సీపీ నేతకు చెందిన భూములను కొనుగోలు చేశారు. దీంతో ఆ నాయకుడిని వైఎస్సార్ సీపీ కోవర్టుగా కొలికపూడి భావించారని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవంగా ఏ నాయకుడి పనితీరైనా నచ్చకపోతే అధిష్టానానికి ఫిర్యాదు చేయాలి. హైకమాండ్ తీసుకునే నిర్ణయం మేరకు అభ్యర్థి వ్యవహరించాల్సి ఉంటుంది. కాని తాను పార్టీలో నియంతనని, పార్టీకి తన మాటే వేదవాక్కు అని కొలికపూడి భావించడంతో టీడీపీ క్యాడర్ భగ్గుమంటోంది.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కె. శ్రీనివాసరావు (ఫైల్)

ఎన్నికల బహిష్కరణకు నిర్ణయం?

అందరి ముందు తీవ్ర అవమానం పాలైన తాళ్లూరి తన సామాజికవర్గం నేతలతో, అభిమానులతో భవిష్యత్ కార్యాచరణ చేస్తున్నట్లు సమాచారం. పలు మార్లు వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన కొలికపూడి విషయంలో అధిష్టానం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ఇక ఆయనతో కలిసి పనిచేసే ప్రసక్తి లేదని సీనియర్లు తెగేసి చెబుతున్నారు. ఇదే విధంగా గతంలో పార్టీ సీనియర్ నేత జయసింహను కూడా మీ సేవలు మాకు అవసరం లేదంటూ ముఖం మీద చెప్పడం కూడా ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇప్పటికే సంగం క్యాడర్ కొలికపూడి ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండగా, ఇప్పుడు మిగిలిన వారు కూడా గుడ్‌బై చెప్పే పరిస్థితి కనిపిస్తోంది.

అమ్మవారి ఆలయంలో భక్తజన సందడి

పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తుల అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ..

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయంలో వేసవి తీవ్రత దృష్ట్యా ఆదివారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ మజ్జిగ పంపిణీని హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన కుంచాల బ్రహ్మయ్య సౌజన్యంతో ఏర్పాటు చేశామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

ముసునూరు: మేకలకు నీళ్లు పెట్టేందుకు తోటలోకి వెళ్లిన మహిళపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతలవల్లికి చెందిన మహిళ శని వారం తన మేకలకు నీరు పెట్టేందుకు దారి లో ఉన్న పామాయిల్ తోటలోకి తోలుకెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన బొద్దుకోళ్ల శ్యామ్‌కుమార్ మేకలకు నీరు పెడితే తోట యజమాని ఊరుకోడని అడ్డుకున్నాడు. నీరు పెట్టుకోవాలంటే తన కోర్కె తీర్చాలంటూ లైంగిక దాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేస్తూ పరిగెత్తుకుంటూ ఇంటికెళ్లి విషయం తన భర్తకు చెప్పింది. భర్త, భార్య ఇద్దరూ కలిసి నిలదీసేందుకు తోటకు వెళ్లగా వీరిపై శ్యామ్‌కుమార్ కర్రతో దాడి చేశాడు. సాయంత్రం మద్యం సేవించి భర్త, భార్యలను దుర్భాషలాడుతూ చంపేస్తానంటూ బెదిరించాడు. దీనిపై బాధిత మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.